క్లుప్తంగా

రేపు మండలంలో వలంటీర్లకు వందనం

చీరాల టౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రామ వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని గురువారం మధ్యాహ్నం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో ఎం.శోభారాణి మంగళవారం తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో నిర్వహించే వలంటీర్లకు వందనం పురస్కారాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్‌లు హాజరవుతున్నారన్నారు. వలంటీర్లకు పురస్కార పంపిణీ కార్యక్రమానికి అన్ని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న వలంటీర్లు అందరూ విధిగా హాజరుకావాలని ఎంపీడీవో సూచించారు.

రోడ్లు దిగ్బంధం చేస్తే కఠిన చర్యలు

యద్దనపూడి: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రధాన రహదారుల్లో ఎటువంటి అనుమతులు లేకుండా రోడ్లను దిగ్బంధం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై నాగశ్రీను సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెళ్లిళ్లు, ఇతర శుభ కార్యాల సందర్భంగా రోడ్లు దిగ్బంధం చేయటం ద్వారా వాహన రాకపోకలకు తీవ్ర ఆటకం ఏర్పడుతుందన్నారు. ఇలా అనుమతులు లేకుండా టెంట్లు వేయటం, రహదారిని మూసివేయటం, ఫ్లెక్సీలు, మైకులు, డీజేలు వంటివి పెడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా టెంట్లు వేసినా సప్లయర్స్ వారిపై కూడా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

విద్యార్థులకు అల్పాహారం


విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న దాత

బల్లికురవ: పదోతరగతి పరీక్షలు విద్యార్థి దశలో అత్యంత కీలకమని.. ఈ 25 రోజులు లక్ష్యంగా చదవాలని కొణిదెనలో యజ్ఞనారాయణ మెమోరియల్ ఉన్నత పాఠశాల స్థల దాత కొణిదెన వెంకట సుబ్బారావు అన్నారు. మంగళవారం సాయంత్రం పదోతరగతి విద్యార్థులు 50 మందికి స్టడీ అవర్లో అల్పాహారం అందించారు. పరీక్షలు జరిగే వరకు ప్రతిరోజూ అల్పాహారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ టి రామాంజనేయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కల కోసం దరఖాస్తులు

జే.పంగులూరు: పంగులూరు మండలంలోని పండ్ల మొక్కలు సాగు చేసే రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని, పంగులూరు మండల ఏపీవో సంతోషం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హార్టికల్చర్ ద్వారా పండ్ల మొక్కలను రైతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. 5 ఎకరాలు లోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలలోని చిన్న సన్నకారు రైతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎకరాకు జామ మొక్కలు (తైవాన్ రకం) 440, నాటు జామ మొక్కలు 110, సపోట 60, సీతాఫలం 260, దానిమ్మ 267, చింత 40, గులాబీలు అరెకరానికి 2 వేల మొక్కలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు తమ భూమికి సంబంధించిన పట్టా పాసు బుక్ జిరాక్స్, అధార్ కార్డు, జిరాక్స్, రైస్‌కార్డు జిరాక్స్, బ్యాంక్ అకౌంటు, పాన్ కార్డు, జాబ్ కార్డు నంబరు తీసుకొని పంగులూరు ఉపాధిహామీ పని కార్యాలయం వద్దకు రావాలని రైతులను కోరారు.

ఎయిడ్స్ నియంత్రణపై కళాజాత

పర్చూరు (చినగంజాం): ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, చీరాల మహిళా మండలి సంయుక్తంగా జిల్లా లెప్రసీ అధికారి రమాదేవి, సీపీఎం బాషా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం పర్చూరు బొమ్మల సెంటర్, ఇంకొల్లు బస్టాండులో హెచ్ఐవీ, ఎయిడ్స్, సుఖవ్యాధుల గురించి గాయత్రి కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించి ప్రజలకు అవగాహన కలిగించారు. కళాజాత కళాకారులు పాటలు, నాటికలు ద్వారా ప్రజలకు హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ, జాగ్రత్తలు, హెచ్ఐవీ వ్యాప్తి గురించి అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఏపీఎస్ఏసీఎస్ టీఐ చీరాల మహిళా మండలి పీడీ ఆర్ శ్రీనివాసరెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ ఏ శ్రీనివాసరెడ్డి, జ్యోతి, అరుణ జ్యోతి, దానమ్మ కళాజాత సిబ్బంది పాల్గొన్నారు.

కొణిదెనలో వైభవంగా ప్రతిష్ట వేడుకలు

బల్లికురవ: మండలంలోని కొణిదెనలో ఎంతో చరిత్ర కలిగిన బ్రహ్మగుండం వద్ద వేంచేసి ఉన్న వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఐదవ వార్షిక కల్యాణం మంగళవారం కనుల పండువగా జరిగింది. ఇక్కడే మండపం ఏర్పాటుతో బుధవారం ఉదయం 10.39 గంటలకు నవగ్రహాలను ప్రతిష్టించనున్నారు. వేడుకల్లో భాగంగా సోమవారం నుంచి హోమాలు, నవగ్రహాలను జలాధి, ధాన్యాధి, క్షీరాధివాసంలో ఉంచారు. వేడుకల్లో భాగంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న గ్రామస్తులంతా రావటంతో ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది.

సమష్టి కృషి చేద్దాం.. పార్టీని గెలిపిద్దాం


యడం బాలాజీని కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు


సమన్వయకర్త బాలాజీని కలిసి మాట్లాడుతున్న చినగంజాం నాయకులు

కారంచేడు: ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేసి వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేద్దామని పర్చూరు నియోజవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త యడం బాలాజీ అన్నారు. మంగళవారం చీరాలలోని ఆయన స్వగృహంలో కలిసి కారంచేడు వైఎస్సార్ సీపీ నాయకులతో మాట్లాడారు. ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీశ్రీనివాసరావుల ఆధ్వర్యంలో మండలంలోని అనేక గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు అందరూ సమష్టిగా పార్టీ విజయానికి కృషి చేద్దామన్నారు. పర్చూరులో పార్టీని గెలిపించి జగనన్నకు బహుమతిగా ఇద్దామన్నారు. కార్యక్రమంలో కొడాలి ధర్మానందరావు, మండల కోఆప్షన్ మెంబర్ ముల్లా నూర్‌అహ్మద్, గుమ్మడి రామోహ్మనరావు, స్వర్ణ సర్పంచ్ మోటాని మధుసూదనరావు, మాదాసు సుబ్బారావు, యార్లగడ్డ పాపారావు, కారుమూడి సుబ్బారెడ్డి, చల్లా సుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

చినగంజాం: 2024 సాధారణ ఎన్నికలలో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తాం అని మండల కన్వీనర్ మున్నం నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మండల పార్టీ నాయకులు నియోజక వర్గ సమన్వయ కర్త యడం బాలాజీకి హామీ ఇచ్చారు. మంగళవారం చీరాలలోని బాలాజీ నివాసగృహంలో ఆయనను మండల నాయకులు స్వయంగా కలిశారు. రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం అని, నియోజకవర్గంలో చినగంజాం మండలం ఎప్పుడూ మెజార్టీ తెచ్చిపెడుతుందన్నారు. కార్యక్రమంలో కడవకుదురు, మోటుపల్లి ఎంపీటీసీలు ఆమంచి వెంకట సుబ్బారావు, కొండూరి గోవింద్, సంతరావూరు సొసైటీ అధ్యక్షుడు కేవీ సుబ్బారావు చౌదరి, కొత్తపాలెం మాజీ సర్పంచ్‌లు కోట రామకృష్ణారెడ్డి, కేవీ రెడ్డి, దేవరకొండ శ్రీను, కాపు కోటిరెడ్డి, బక్కా వెంకటరెడ్డి, ఏ శ్రీరామకృష్ణ, ఎస్సీ, బీసీ సెల్ కన్వీనర్ పాదర్తి ప్రకాష్, వీవీఆర్ ప్రసాద్, మాజీ పార్టీ కన్వీనర్ కోట విజయభాస్కర్‌రెడ్డి, రామ్‌లక్ష్మణ్ సోదరులు, సైదా, సుభాని తదితరులు పాల్గొన్నారు.


బాలాజీని కలిసిన చినగంజాం ముస్లిం నాయకులు

బాలాజీని కలిసిన ముస్లిం నాయకులు

మండలంలోని పలు గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం పర్చూరు వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త యడం బాలాజీని ఆయన నివాసగృహంలో కలిశారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, కొత్తపాలెం సర్పంచ్ ఆసోది బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని మున్నం వారిపాలెం, బాగ్యనగర్, చినగంజాం మసీదుపేట, ఇస్లాం పేటకు చెందిన సుమారు 50 మందికి పైగా నాయకులు కార్యకర్తలు ఆయనను కలిసిన వారిలో ఉన్నారు. ముస్లింలు వారి సంప్రదాయం ప్రకారం ఆయనను సత్కరించారు.

జగనన్నను సీఎం చేసేందుకు సిద్ధం


మహిళలతో నియోజకవర్గ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

● 'పల్లెపల్లెకు హనిమిరెడ్డి' చిన హనిమిరెడ్డి


స్థానికులతో మాట్లాడుతున్న హనిమిరెడ్డి

బల్లికురవ: జగన్ మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా చేసేందుకు గ్రామాల వారీగా ప్రజలు సిద్ధంగా ఉన్నారని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు పంచాయతీలోని సుజాత నగర్ కాలనీ, సిపాయి కాలనీల్లో 'పల్లెపల్లెకు హనిమిరెడ్డి' కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి ప్రజలను పలకరించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్ని నవరత్నాలతో పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సచివాలయ వలంటీర్ వ్యవస్థ ద్వారా నేరుగా అందించటం ద్వారా జగనన్న ప్రజల హృదాయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. సంక్షేమ పథకాలు నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమవడంవల్ల లబ్ధిదారులంతా సంతోషంలో ఉన్నారన్నారు. 70 రోజులుగా తాను ఈ ప్రాంతానికి కొత్త అయినా అయిదు మండలాల ప్రజలు తనను కుటుంబసభ్యుడిగా ఆదరిస్తున్నారని హనిమిరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఐదేళ్ల పదవులు అనుభవించి పార్టీ మారిన నాయకులను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగనన్నను అద్దంకి ఎమ్మెల్యేగా తనను ఓటుతో ఆశీర్వదించాలని ప్రజలకు విన్నవించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పసల అంజలి నాగేశ్వరరావు, మండల ఉపాధ్యక్షుడు విప్పల వెంకట సుబ్బారెడ్డి, వల్లాపల్లి సొసైటీ అధ్యక్షుడు మంచాల శ్రీనివాసరెడ్డి, స్థానిక నేతలు చింతల శ్రీనివాసరావు, నాగిపోగు దయామణి, రావులపల్లి వెంకటేశ్వర్లు, కల్లూరు అంజయ్య, మూరబోయిన కొండలు, ఆలకుంట రాజయ్య, మేదర ఇమ్మానియేల్, జ్యోతి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి


మందుల స్టోర్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో రూతమ్మ


గొనసపూడిలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

వేటపాలెం: వైద్యశాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఎంపీడీవో రూతమ్మ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీడీఓ రూతమ్మ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాల్లో రికార్డులను, స్టోర్ రూమ్‌లో నిల్వ ఉన్న మందులను పరిశీలించారు. వైద్యశాలకు వచ్చిన పేషెంట్‌లను వైద్యులు అందిస్తున్న సేవల గూర్చి అడిగి తెలుసుకున్నారు. వైద్యశాల్లో కావాల్సిన అవసరాలపై డాక్టర్ బాలరాజుతో చర్చించారు. ప్రజలకు 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. వీరి వెంట సిబ్బంది ఉన్నారు.

గొనసపూడిలో 437 మందికి వైద్యపరీక్షలు..

చినగంజాం: జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమంలో భాగంగా సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని గొనసపూడి గ్రామంలో స్థానిక పోలేరమ్మ గుడి వద్ద వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామంలోని గర్భిణులు, బాలింతలు దీర్ఘకాల రోగులను, అనారోగ్యంతో బాధపడుతున్న 437 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కంటికి సంబంధించిన వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.


బల్లికురవలో రోగులను పరీక్షించి సూచనలు ఇస్తున్న వైద్యాధికారి

కార్యక్రమంలో వైద్యాధికారులు కే కీర్తి సరోజ్, డాక్టర్ బీ నాగేంద్ర, ప్రత్యేక వైద్యనిపుణులు నవీన్ కుమార్, ఎస్‌కే అజీమ్‌లు పరీక్షలు నిర్వహించారు.

బల్లికురవ: ప్రభుత్వం ప్రజల ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఇంటింటా వైద్యసేవలు అందించేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు ఏర్పాటు చేసిందని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్ తెలిపారు. మంగళవారం బల్లికురవలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరం నిర్వహించారు. 327 మందికి వివిధ రకాల పరీక్షలు 20 మందికి కంటి పరీక్షలతో మందులు పంపిణీ చేశారు. గైనకాలజిస్ట్ ప్రణవి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు సన్మానం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మ్యాథ్యుబాబు

జే.పంగులూరు: నేడు మండల పరిధిలోని పంగులూరు టీటీడీ కళ్యాణ మండపంలో జరిగే వలంటీర్లకు సన్మాన కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంపీడీవో రామాంజినేయులు అన్నారు. మండలంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీడీవో మ్యాథ్యుబాబు మాట్లాడుతూ సేవామిత్ర అవార్డుకు మండలంలోని 248 వలంటీర్లు ఎంపికైనట్లు తెలిపారు. వీరికి ఒక్కొక్కరికి రూ. 15 వేలు, సేవారత్న అవార్డు మండల స్థాయిలో ఐదుగురు ఎంపిక కాగా వీరికి ఒక్కొక్కరికి రూ. 30, సేవావజ్ర మండలంలో ఐదుగురు ఎంపికవ్వగా వీరిలో ఒక్కొక్కరికి రూ. 45 వేలు చొప్పున నగదు అందించనున్నట్లు తెలిపారు.

నేడు వలంటీర్లకు పురస్కారాలు

చీరాల: చీరాల పట్టణ పరిధిలో బుధవారం మధ్యాహ్నం 3గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రతినిధి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఆర్‌పీఎం హైస్కూల్‌లోని ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో ప్రతిభ కనబరచిన వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలను అందించనున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్‌లు హాజరవుతున్నారని ప్రకటనలో తెలిపారు.

కంచెను ధ్వంసం చేసిన వ్యక్తులపై కేసు

చినగంజాం: కడవకుదురు రిజర్వ్ ఫారెస్ట్‌లో కంచెను ధ్వంసం చేసి విధులు నిర్వహిస్తున్న ఫారెస్ట్ ఉద్యోగులను దుర్భాషలాడిన ఘటనకు సంబంధించి కొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం శ్రీనివాసరావు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. చీరాలకు చెందిన నన్నపనేని రామకృష్ణ, మరి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మండలంలోని కడవకుదురు రిజర్వ్ ఫారెస్ట్‌లో మొక్కలకు వేసిన కంచెను ధ్వంసం చేయడంతో అటవీ భూమి కంచెను తొలిగించేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో అక్కడ వాచ్‌మన్‌లుగా పనిచేస్తున్న కే రవి, అతని సహాయకుడు జే హేమంత్‌లు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈఘటనకు సంబంధించి అసిస్టెంట్ ప్లాంటేషన్ మేనేజర్ జే గాంధీ ఈదుశ్వర్యకు పాల్పడిన రామకృష్ణతో పాటు మరికొందరిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు తప్పనిసరి


స్వర్ణ స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఎంఈవో, ఉపాధ్యాయులు

కారంచేడు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల నైపుణ్యాలను మరింత పెంపొందించుకొనేలా ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చెయ్యాలని ఎంఈఓ-2 మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని స్వర్ణ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల ప్రాథమిక పాఠశాలల సముదాయాల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికితీయడమే కాకుండా, మరింత మెరుగుపరిచేలా కృషి చేయాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఉపాధ్యాయుల్లోని ప్రతిభను మెరుగుపరచడంలోను దోహదపడతాయాన్నరు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచడంతో పాటు, విద్యార్థుల హాజరు శాతంను కూడా మరింత పెంచాలన్నారు. గతంతో పోల్చుకుంటే ప్రభుత్వ పాఠశాలల తీరు ఎంతో బాగుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఎంవీ సుబ్బారావు, కార్యదర్శి పారి కోటేశ్వరరావు, మండలంలోని అన్ని గ్రామాల 50 శాతం మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం


అజెండాలోని అంశాలను చదువుతున్న కమిషనర్

అద్దంకి: అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్మన్ లక్కెనబోయిన ఎస్తేరమ్మ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసమావేశం కమిషనర్ అహ్మద్ రషీద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొత్తం 50 అంశాలను సీనియర్ అసిస్టెంట్ అర్జునరావు చదవగా, కౌన్సిలర్లు ఏకగ్రీవ తీర్మానం చేశారు. అంశాలన్నింటినీ ఆమోదిస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. ఆమోదించిన అంశాల్లో 11వ వార్డులో సీసీ డ్రైన్, 10వ వార్డువలో సీసీ డ్రైన్, సీసీ రహదారి నిర్మాణం, అలాగే మహిళామార్టు సమీపంలో రూ.32 లక్షలతో వాటర్ ప్లాంటు, జనగన్న కాలనీల వద్ద ఎంట్రన్స్ ఆర్చి నిర్మాణం చేయుటకు ఆమోదించారు. 18వ వార్డులోని శ్మశానంలో జంగిల్ క్లియరెన్స్, 5వ వార్డులో సీసీ డ్రైన్ నిర్మాణం. 5వ 1వ వార్డులోని పలు బజార్లను గ్రావెల్ రోడ్డుగా వేయడానికి తీర్మానించారు. 9వ వార్డులో సీసీ డ్రైన్‌ల నిర్మాణం. 2వ వార్డులో పైప్‌లైన్ ఏర్పాటు. కమిషనర్ చాంబర్‌ను అభివృద్ధి చేయడానికి ఆమోదం తెలిపారు. ఔట్ సోర్సింగ్ వర్కర్లకు రూ.1000, ఆరో వార్డులో సీసీ రహదారి నిర్మాణం చేయుటకు ఆమోదం తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్లు దేశ పద్మేశ్, కే అనంత లక్ష్మి, కౌన్సిలర్లు, మేనేజర్ శ్రీదేవి, మున్సిపల్ సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, తదితరులు ఉన్నారు.

తడి, పొడి వ్యర్థాలపై అవగాహన


మాట్లాడుతున్న ఎంపీడీవో శోభారాణి

చీరాల టౌన్: వ్యర్థాలను సమాజానికి ఉపయోగపడే పదార్థాలుగా మారుద్దామని అధికారులు పేర్కొన్నారు. మంగళవారం ఐటీసీ బంగారు భవిష్యత్, సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో చీరాల మండల పరిషత్ ఆఫీసులో పారిశుధ్య నిర్వహణపై డివిజనల్ స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల ద్వారా వాటిని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లులకు తరలిస్తే వాటిలో తడి వ్యర్థాలను ఉపయోగపడే ఎరువులుగానూ, పొడి వ్యర్థాలను రీసైక్లింగ్‌తో లాభదాయకమైన వనరులుగా మారుస్తారని చెప్పారు. దాంతో పంచాయతీకు అదనపు నిధులు సమకూరుతాయని చెప్పారు. ఎంపీడీవో శోభారాణి, సెర్ప్ సంస్థ పీసీవో కృష్ణ మాట్లాడుతూ వ్యర్థాల నిర్వహణ పట్ల గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ సెక్రటరీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు, డివిజినల్ పంచాయతీ అధికారి దారా హనుమంతరావు, ఏపీసీ నారాయణ ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, హాజరయ్యారు.

వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సుధ

చీరాల రూరల్: విద్యార్థినులను వేధింపులకు గురిచేసినా, అగౌరవ పరచినా కఠిన చర్యలు తీసుకుంటామని సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ అన్నారు. సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఉడ్‌నగర్‌లోగల సాంఘీక సంక్షేమశాఖ బాలికల వసతి గృహంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో ముఖ్య అతిథిగా న్యాయమూర్తి సుధ పాల్గొని మాట్లాడారు. ర్యాగింగులకు పాల్పడితే కేసులు నమోదవుతాయని తద్వారా ఉద్యోగాలు రావని, జీవితాలు అంధకారమవుతాయని చెప్పారు. ఉచిత న్యాయ సహాయం గురించి, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, బాల కార్మిక నిరోధక చట్టం, సైబర్ క్రైమ్ వంటి గురించి విద్యార్థినులకు వివరించారు. సదస్సులో వసతి గృహ వార్డెన్ రాజేశ్వరి, న్యాయవాద సంఘ అధ్యక్షుడు జి. రమేష్ బాబు, న్యాయవాదులు ఈశ్వరి రెడ్డి, సురేష్, పీఎల్‌వీ, ఎస్టీ, మతిన్ తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు (చినగంజాం): ప్రపంచ సామాజిక దినోత్సవం సందర్భంగా పర్చూరు ఇందిరా కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు పర్చూరు మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయవాది సీహెచ్ శ్రీ రమణి విద్యాహక్కు చట్టం, పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పీ నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

కారంచేడు: గ్రామ దేవతగా, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొంది భక్తులతో నీరాజనాలు అందుకుంటున్న గంగమ్మతల్లి ఆలయ పునఃనిర్మాణ రెండో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ రకాల పూలు, పండ్లతో అలంకరించిన అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. వార్షిక వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అవుల రాజేష్ భక్తులతో ప్రత్యేక పూజలు చేయించి తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం, తాగునీటి వసతులు కల్పించారు. గ్రామానికి చెందిన మహిళలు, ఆడపడుచులు అమ్మవారికి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. ఉదయం నుంచి రాత్రి వరకు సప్తాహం నిర్వహించారు.

వైద్యశాలను పరిశీలించిన డీఎంహెచ్‌వో


రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

మేదరమెట్ల: మేదరమెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డీఎంహెచ్‌వో ఎస్ విజయమ్మ, జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి టి. వెంకటేశ్వర్లు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తనిఖీలో భాగంగా వైద్యశాలలోని గదులను, డెలివరీ రూమ్, రికార్డులను పరిశీలించారు. గర్భిణులకు సరైన సమయంలో సేవలు అందిచాలన్నారు. మార్చి 3న జరిగే పల్స్ పోలియో విజయవంతంగా నిర్వహించేందుకు సిబ్బంది కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో జీ. చిట్టిబాబు, పి. నిఖిలరెడ్డి, మనోజ్ పాల్గొన్నారు.

ఘనంగా భీష్మ ఏకాదశి పూజలు


అలంకరణలో చెన్నకేశవస్వామివారు

యద్దనపూడి: మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో వేంచేసి ఉన్న చెన్నకేశవ స్వామి ఆలయంలో మంగళవారం భీష్మ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి సుప్రభాతం, అభిషేకాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు గీతాపారాయణ, విష్ణు సహస్రనామ స్తోత్రాలు పఠించారు. అర్చకులు నారాయణం శ్రీనివాసాచార్యులు భీష్మ చరిత్రను భక్తులకు వివరించారు.

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన నాయకులు


సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

జే.పంగులూరు: మాజీ టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని మంగళవారం తాడేపల్లి ఆయన నివాసంలో మండల నాయకులు కలిశారు. రాజ్యసభ సభ్యుడిగా నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కలిసిన వారిలో బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పల్లపు రాము, నాయకులు గాదే బ్రహ్మారెడ్డి, యర్రం గోపాల్‌రెడ్డి, బత్తుల నాని, శ్రీను, సుబ్బారెడ్డి ఉన్నారు.

విద్యాబోధనపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

వేటపాలెం: ప్రభుత్వం పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జెడ్పీ హైస్కూల్ కంప్లెక్స్ చైర్మన్, హెచ్ఎం బి వెంకటేశ్వరరావు సూచించారు. పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాల స్థాయి కాంప్లెక్స్ సమావేశం మంగళవారం నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ పిల్లల సమర్థత ఎలా బోధించాలనే దానిపై అవగాహన కల్పించారు. ఎఫ్ఏ-4 ప్రశ్నపత్రాల తయారు వంటి పలుఅంశాలపై ఉపాధ్యాయలతో చర్చించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.